సాక్షి బాపట్ల

ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



త్రికోటేశ్వరుని సేవలో న్యాయమూర్తి

నరసరావుపేటరూరల్: హైకోర్టు న్యాయమూర్తి సుజాత త్రికోటేశ్వర స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆమె స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.9148 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4000 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ సుస్మితారెడ్డి దంపతులకు అర్చకస్వాములు, అధికారులు స్వాగతం పలికారు. అతిథిగృహంలో అర్చక స్వాములు సంప్రదాయబద్ధంగా తలపాగా చుట్టారు. వేదమంత్రోచ్చారణలు, మేళతాళాలతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, వెండి ప్రభను తలపై ఉంచుకొని గొల్లభామ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకుని స్వామి వారికి పట్టువస్త్రాలు, వెండిప్రభను అందజేశారు. వీరి వెంట జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ దంపతులు, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దంపతులు ఉన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, దేవదాయ శాఖ అదనపు కమిషనర్ చంద్రకుమార్, డిప్యూటీ కమిషనర్ వేమన చంద్రశేఖరరెడ్డి, ఈవో వేమూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

స్పందన కార్యక్రమం కొనసాగుతుంది

బాపట్ల: బాపట్ల జిల్లా పరిధిలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం కొనసాగుతుందని డీఆర్‌ఓ కె.లక్ష్మీశివజ్యోతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో గత సోమవారం స్పందన కార్యక్రమం నిలిచిపోయిందని, ఈ సోమవారం నుంచి యాథావిధిగా ఉదయం 10.30కు ఉంటుందని తెలిపారు.



కోటప్పకొండ ప్రాంగణంలో భక్తుల రద్దీ



క్వారీ బాలకోటేశ్వరస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం



గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవస్థానానికి పోటెత్తిన భక్తులు

దివ్యోత్సవం.. శివోత్సవం


- శైవక్షేత్రాల్లో వైభవంగా మహా శివరాత్రి వేడుకలు
- కాంతులీనిన భారీ విద్యుత్ ప్రభలు
- భక్తులతో కిక్కిరిసిన శివయ్య కోవెలలు



భక్తుల పూజలందుకుంటున్న అమరేశ్వరుడు



సత్రశాలలో స్వామివారిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు



కోటప్పకొండపై త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో మహాశివరాత్రి తిరునాళ్లలో వెలుగులు విరజిమ్ముతున్న విద్యుత్ ప్రభలు



పెదకాకాని శివాలయం ప్రాంగణంలో భక్తుల రద్దీ



సీతానగరం ఘాట్‌లో భక్తజనం

కోరినంతనే కోర్కెలు తీర్చే భక్తవల్లభుడు.. భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న భోళా శంకరుడి క్షేత్రాలు మహాశివరాత్రికి శోభిల్లాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని ప్రముఖ శైవక్షేత్రాలు, ఆలయాలు శివరాత్రి వేడుకలతో ఆధ్యాత్మిక జ్యోతులు వెదజల్లాయి. కోటప్పకొండపై కొలువుదీరిన త్రికోటేశ్వరస్వామి సన్నిధి శివనామ స్మరణతో మారుమోగింది. మహాశివరాత్రి సందర్భంగా లక్షలాది మంది భక్తులు శనివారం కొండపై కోటయ్యను దర్శించుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు స్వామి సన్నిధికి చేరుకోవడంతో కోటప్పకొండ భక్తజనసంద్రంగా మారింది. పంచారామ క్షేత్రాల్లో ప్రథమారామ క్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. వేలాదిగా భక్తులు అమరేశ్వరుడి దర్శనం చేసుకున్నారు. ముందుగా భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమరేశ్వరాలయంలో దీపారాధన నిర్వహించారు. రెంటచింతల మండలంలోని సత్రశాలలో కొలువైన గంగా భ్రమరాంబ సమేత మల్లన్న దర్శనానికి భక్తజనులు పోటెత్తారు. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకాకాని శివక్షేత్రంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఓం నమఃశివాయ నామం మార్మోగింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. మంగళగిరి-తాడేపల్లి పరిధిలోని సీతానగరం ఘాట్లతో పాటు ఉండవల్లి కరకట్ట వెంబడి కృష్ణా నదిలో వేలాదిగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆయా ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమర్తలూరు మండలం గోవాడలోని బాలకోటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ట్రాక్టర్లు, ఎద్దులబండ్లపై దైవ దర్శనం కోసం తరలివచ్చారు. ప్రభలతో దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చుండూరులోని బాలత్రిపురసుందరీదేవి సమేత బాలకోటయ్యస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. హరహర మహాదేవ.. శంభోశంకర.. అంటూ చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామిని సుమారు లక్ష మంది భక్తులు దర్శించుకున్నారు. విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, ఎస్పీలు వివిధ శైవ క్షేత్రాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 555.40 అడుగుల వద్ద ఉంది. ఇది 221.8332 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 10,120, ఎడమకాలువకు 8,896, ఎస్ఎల్‌బీసీకి 2,200, వరదకాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 21,626 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 21,626 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 829.90 అడుగుల వద్ద ఉంది. ఇది 49.4063 టీఎంసీలకు సమానం.

శరవేగంగా రీ-సర్వే

- మేడికొండూరు, వట్టిచెరుకూరు మండలాల్లో పూర్తి
- డిసెంబర్‌లోగా అన్ని గ్రామాల్లో..
- జిల్లాలో 173 గ్రామాల్లో రీ-సర్వే
- ఇప్పటికే 93 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి
- 23 గ్రామాల్లో మ్యాపింగ్ పూర్తి
- జిల్లాలో 5,95,388 ఎకరాల్లో కొలతలు
- వందేళ్ల తర్వాత ఇదే ప్రథమం



సర్వే కోసం వినియోగిస్తున్న డ్రోన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద రీ-సర్వే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి జిల్లా మొత్తం రీ-సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎప్పుడో 1905లో బ్రిటీషర్లు చేపట్టిన తర్వాత 2020 వరకు మరే నాయకుడు దీనిజోలికి వెళ్లే ధైర్యం చేయలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రీ-సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఈ ప్రక్రియను జిల్లాలో 2020 డిసెంబర్‌లో ప్రారంభమైంది. తొలుత పైలెట్ ప్రాజెక్ట్ కింద దుగ్గిరాల మండలంలోని దేవరాపల్లి అగ్రహారం, ప్రత్తిపాడు మండలంలోని కొండజాగర్లమూడి, వేమూరు మండలంలోని పులిచింతలపాలెం, యడ్లపాడు మండలంలోని మద్దిపాలెం, దాచేపల్లి మండలంలోని అలుగుమల్లిపాడును ఎంపిక చేశారు. అక్కడ విజయవంతంగా పూర్తిచేశారు. ఇప్పటి వరకూ 2,220 ఎకరాలకు గాను 1615 మందికి భూమి హక్కు పత్రాలను అందజేశారు. మరో 325 సిద్ధంగా ఉన్నాయి.

ఉపయోగాలు ఇవీ..

రీ-సర్వే అనంతరం సంబంధిత భూమి, స్థలం యజమానికి ప్రింటెడ్ పాస్‌బుక్ ఉచితంగా ఇస్తారు. భూహద్దు, దస్తావేజు సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి. చట్టబద్ధత ఏర్పడుతుంది. గ్రామాల్లో భూ కబ్జాలు, వివాదాలకు స్వస్తి పడుతుంది. రీ-సర్వే తర్వాత ఇచ్చే పట్టాలు, పాస్‌బుక్స్‌తో రుణాలు పొందవచ్చు.

93 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి

గుంటూరు జిల్లాలో మొత్తం 223 గ్రామాలు ఉండగా, గుంటూరు డివిజన్‌లో 119, తెనాలి డివిజన్‌లో 104 గ్రామాలు ఉన్నాయి. సీఆర్‌డీఏ పరిధిలోని 20 గ్రామాలు, మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాలుగు గ్రామాలు, 26 అర్బన్ గ్రామాల్లో ప్రస్తుతం సర్వే నిర్వహించడం లేదు. ఇప్పటికి ఐదు పైలెట్ గ్రామాల్లో సర్వే పూర్తయింది. 47 గ్రామాల్లో సర్వే ఆఫ్ ఇండియాకు, 121 గ్రామాల్లో యుక్రా అనే సంస్థకు రీసర్వే బాధ్యతలు అప్పగించారు. సర్వే ఆఫ్ ఇండియాకు అప్పగించిన 47 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేసింది. యుక్రా సంస్థ 46 గ్రామాల్లో డ్రోన్‌ను తిప్పింది. మొత్తం 93 గ్రామాల్లో డ్రోన్‌ను తిప్పి ఏరియల్ వ్యూ మ్యాపింగ్ పూర్తి చేశారు. 23 గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్)ను జారీ చేశారు. మరోవైపు భూయజమానులు స్థానికంగా అందుబాటులో లేకపోవడం వల్ల కూడా కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. మూడు వేల ఎకరాల భూమి ఉన్న ఒక గ్రామం సర్వేను పూర్తిస్థాయిలో చేయడానికి నాలుగు నుంచి ఐదు నెలల సమయం పడుతోంది. అయినా ప్రభుత్వం దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తోంది.

లక్ష్యానికి అనుగుణంగా సర్వే



జిల్లాలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద నిర్వహిస్తున్న రీ-సర్వే వేగంగా జరుగుతోంది. ఇప్పటికి 93 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయింది. మరోసారి డ్రోన్ వస్తే మిగిలినవి కూడా పూర్తి చేస్తాం. గ్రామాల్లోకి అధికారులు వచ్చేటప్పుడు రైతులు అందుబాటులో ఉండి సహకరిస్తే పని త్వరగా పూర్తవుతుంది. సివిల్, క్రిమినల్ వివాదాలకు స్వస్తి పలకడం ద్వారా గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణం వచ్చేలా చేయవచ్చు.

– జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్

నేడు ఎస్ఐ పోస్టుల ప్రిలిమినరీ పరీక్ష

- జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలు, 14,791 మంది అభ్యర్థులు
- పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు

నగరంపాలెం(గుంటూరు): ఏపీ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టుల భర్తీకి జిల్లాలో నిర్వహించనున్న ప్రిలిమినరీ పరీక్షలకు కేంద్రాలు సిద్ధమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 14,791 మంది అభ్యర్థులకు 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించనున్నారు. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించే ప్రసక్తిలేదని అధికారులు ప్రకటించారు. అభ్యర్థులు ముందుగానే కేంద్రాల వద్దకు రావాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. పరీక్షా కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు, ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అభ్యర్థులు హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, నలుపు/బ్లూ పెన్‌లను మాత్రమే లోనికి అనుమతించనున్నారు. తాగునీరు, ఇతర మౌలిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ దుకాణాల మూసివేతతో పాటు, కేంద్రాల వద్ద గుంపులుగా లేకుండా చర్యలు తీసుకోనున్నారు.

సత్తాచాటిన నంద్యాల జిల్లా ఎడ్ల జతలు



రామాపురంలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాచర్ల: మండలంలోని గుడిమెట్ట పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామ సమీపంలోని సిద్ధి భైరవేశ్వరస్వామి వారి మహాశివరాత్రి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ఉల్లాసంగా సాగాయి. ఈ రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలను ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు చేతులు మీదుగా రిబ్బన్ కట్ చేసి పందాలను ప్రారంభించారు. నంద్యాల జిల్లా, నంద్యాల మండలం, బిల్లలాపురం గ్రామానికి చెందిన భూమా గోవర్ధన్ రెడ్డికు చెందిన ఎడ్లు నిర్ణీత 15 నిమిషాల్లో 1621 అడుగులు లాగి మొదటి బహుమతి సాధించాయి. వైఎస్సార్ జిల్లా, కాశినాయన మండలం, అనవారిపల్లె గ్రామానికి చెందిన శీలం జగన్‌మోహన్ రెడ్డి ఎడ్లు రెండు, బేస్తవారిపేట మండలం, జేసీ అగ్రహారం గ్రామానికి చెందిన లక్కు సాయి సాత్విక్ చెందిన ఎడ్ల జతలు మూడు, పెద్దరావీడు మండలం, సుంకేసుల గ్రామానికి చెందిన ముద్దపాటి శ్రీనివాసుల చెందిన ఎడ్ల జతలు నాలుగో స్థానంలో నిలిచాయి. రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలను వరుస బహుమతులుగా ఎడ్ల యజమానులకు అందించారు. దేవస్థానం ధర్మకర్త మధిరె శ్రీరంగారెడ్డి, ఉప ధర్మకర్త శ్రీరంగపు వెంకట నారాయణరెడ్డి, ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు కుమారుడు అన్నా కృష్ణచైతన్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

గిద్దలూరు రూరల్: మహా శివరాత్రి పండుగ సందర్భంగా పట్టణంలోని పాతాళనాగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో శనివారం నిర్వహించిన ఎడ్ల పోటీలలో గెలుపొందిన విజేతలకు స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన తేజశ్రీ ఎడ్లు 3480 అడుగులు బండను లాగి మొదటి స్థానం, చాపాడు మండలం వీరతేజ ఎడ్లు 3005 అడుగులు లాగి రెండు, నంద్యాల జిల్లా కుమ్ములూరు గ్రామానికి చెందిన బీఎస్ఆర్ పల్లవిక ఎడ్లు మూడు, వైఎస్సార్ జిల్లా రాజుపాలెంకు చెందిన బండి వెంకటశివారెడ్డి ఎడ్లు నాలుగు, కంభం మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన వెంకటగిరి హేమల తానాయుడు ఎడ్లు ఐదో స్థానంలో నిలిచాయి. రూ. 50 వేలు, రూ. 40 వే లు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలు వరుస బహుమతులు అందించారు. పాతాళనాగేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సత్తాచాటిన అర్థవీడు ఎడ్లు

కంభం: మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని చిన్నకంభం వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో అర్థవీడు మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన సోమిశెట్టి రమేష్ ఎడ్లు 2730.10 అడుగులు లాగి ప్రథమస్థానంలో సత్తాచాటాయి. వైఎస్సార్ కడప జిల్లా, దాసరి పల్లి గ్రామానికి చెందిన శీలం రమేష్ ఎడ్లు, వైఎస్సార్ కడప జిల్లా కలసపాడుకు చెందిన శంకరయ్య యాదవ్ ఎడ్లు, కంభం మండలం ఔరంగబాదు గ్రామానికి చెందిన అంబరపు రామోజి, యరగొండపాలెంకు చెందిన శ్రీనివాసరెడ్డి ఎడ్లు, వైఎస్సార్ జిల్లా పెద్దజొన్నవరానికి చెందిన కాకి యుగంధర్ ఎడ్లు, అర్థవీడు మండలం బొల్లుపల్లి గ్రామానికి చెందిన సింగారెడ్డి శ్రీనివాసరెడ్డి ఆ తరువాత స్థానాల్లో నిలిచాయి. రూ. 30వేలు, 25వేలు, 20వేలు, 15 వేలు, 10 వేలు, 6 వేలు అందజేశారు.

గోవాడలో మంత్రి మేరుగ పూజలు

గోవాడ (వేమూరు): పేద ప్రజలకు ఉన్నతమైన సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి బాల కోటేశ్వరస్వామి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆకాంక్షించారు. వేమూరు నియోజక వర్గం అమర్తలూరు గోవాడ గ్రామంలో బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బాపట్ల జిల్లాలోని వేమూరు నియోజక వర్గం అమర్తలూరు మండలంలోని గోవాడలోని పెద్ద పుణ్య క్షేత్రం బాల కోటేశ్వర స్వామి దర్శనం చేసుకోవడం వరమన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్న మాటలను కట్టడి చేయాలని ఆయన దేవుడికి విన్నవించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఉడా చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు, ఆలయ కమిటీ చైర్మన్ చేరుకూరి వెంకట లక్ష్మియ్య చౌదరి, ఆలపాటి రమాదేవి, పాటి బండ్ల సీతారామయ్య, బోడ్డు కోటేశ్వరరావు, కొమ్మి శెట్టి గోపి, అనుషా, అచ్చమ్మ, నూతక్కి శంకర్, మోనోహర్ రెడ్డి, వెంకట అప్ప రెడ్డి, నాయుడు రవి, అమృతలూరు వెంకయ్య, పద్మ, దోవా రవీంద్ర, తోట శివ పార్వతి, లాం నాగేశ్వరరావు, భీమ వరపు సాంబ రెడ్డి, టి.ప్రేమయ్య, దేవస్థానం కార్యనిర్వహణాధికారి అశోక్ రెడ్డి, పాల్గొన్నారు.



గోవాడ బాల కోటేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి మేరుగ నాగార్జునకు ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

క్వారీ దేవస్థానం వద్ద ఏర్పాట్ల పరిశీలన

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఏర్పాట్లు, పోలీసు బందోబస్తును శనివారం రాత్రి గుంటూరు ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ పరిశీలించారు. మండల పరిధిలోని నారాకోడూరు జంక్షన్ వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించి స్థానిక సీఐ ప్రభాకరరావుకు పలు సూచనలు చేశారు. దేవస్థానానికి ప్రభలు వెళ్లే సమయంలో ట్రాఫిక్ సమస్యలు, ఇబ్బందులు ఏర్పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల్ని తెలియజేశారు. క్వారీ దేవస్థానం ప్రాంగణం, తెనాలి, నారాకోడూరు రహదారి ప్రాంతాల్ని పరిశీలించారు. ఎస్పీ వెంట తెనాలి డీఎస్పీ స్రవంతిరాయ్, స్థానిక సీఐ, ఎస్ఐలు ఉన్నారు.



దేవస్థానం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



ఇంటి నిర్మాణాలపై సూచనలందిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చీరాల టౌన్: నిరుపేదలకు కలగా ఉన్న సొంతింటి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ఉగాది పండుగ రోజు లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం చీరాల మండలంలోని చీరాలనగర్-1, 2 లేఅవుట్లలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇంటి నిర్మాణాలపై పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలకు సొంతింటిని అందించి పేదల పెన్నిధిగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ఉగాది పండుగకు గృహ ప్రవేశాలు చేయాలన్నారు. ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం అందిస్తున్న సాయాలను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన నిర్మాణాలు చేపట్టాలన్నారు. గృహ లబ్ధిదారుల్లో వైఎస్సార్ కేపీ పొదుపు మహిళలకు అదనంగా రూ.35 వేలు రుణం కూడా అందిస్తున్నామన్నారు. జేసీ వెంట చీరాల ఆర్డీవో సరోజిని, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీవో నేతాజీ, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

బావిలో పడి గ్రానైట్ కార్మికుడు మృతి

బల్లికురవ: బతుకుదెరువుకు రాష్ట్రాలు దాటి వచ్చిన గ్రానైట్ కార్మికుడు బావిలో పడి చనిపోయాడు. ఈ ఘటన శనివారం బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలోని వేమవరం జంక్షన్ సమీపంలో వెలుగు చూసింది. బల్లికురవ పోలీసుల వివరాల మేరకు.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన హరేరామ్ విచర్డ్ (32) పదిరోజుల క్రితం మార్టూరు మండలం నాగరాజుపల్లె గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు వచ్చాడు. గురువారం సాయంత్రం బల్లికురవలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు వెళ్తున్నానని తోటి కార్మికులకు చెప్పాడు. రెండు రోజులైనా కానరాకపోవటంతో తోటి కార్మికులు భయాందోళనకు గురయ్యారు. శనివారం వేమవరం జంక్షన్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వెనుకభాగంలోని బావిలో శవం ఉందని తెలియడంతో గ్రానైట్ కార్మికులంతా వచ్చి చూశారు. ఈవిషయం గ్రానైట్‌లో పనిచేస్తున్న కార్మికులకు తెలియటంతో వారు వచ్చి చూసి హరేరామ్‌గా గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యం సేవించి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడని తోటి కార్మికులు భావిస్తున్నారు. బల్లికురవ ఎస్సై వేమన, కేసు నమోదుతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

త్రికోటేశ్వరుడిని దర్శించుకున్న కలెక్టర్ కుటుంబం

ఆర్టీసీ బస్సులో ప్రయాణం, క్యూ లైన్‌లో దర్శనం



బస్సులో ప్రయాణిస్తున్న కలెక్టర్ శివశంకర్

సాక్షి, నరసరావుపేట: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శనివారం ఉదయం సాధారణ భక్తుల తరహాలో కుటుంబ సమేతంగా ఆర్టీసీ బస్సులో కొండ దిగువ నుంచి కొండపైకి ప్రయాణం చేశారు. కొండ పైన ఉన్న స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. వారితోపాటు క్యూలైన్‌లో వెళ్లి దర్శనం చేసుకున్నారు. భక్తులకు అందుతున్న సేవలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని దేవదాయశాఖ, ఇతర శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం క్యూలైన్ ద్వారా వెళ్లి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయ నిర్వాహకులు స్వామి వారి శేష వస్త్రాలతో జిల్లా కలెక్టర్ దంపతులను సత్కరించి స్వామివారి ఆశీర్వచనాలను అందించారు.

కొండపైకి ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే



ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలో కొండ దిగువ నుంచి కొండ పైకి ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వచ్చారు. కొండపై పార్కింగ్ స్థలం తక్కువగా ఉండటంతో ప్రైవేటు వాహనాలను కొండపైకి గత కొన్ని సంవత్సరాలుగా అనుమతించడం లేదు. వీఐపీలు కొండ దిగువ నుంచి ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రైవేటు వాహనాల్లో కొండపైకి చేరుకుంటారు. ఈ ఏడాది కూడా ఇదే ఆనవాయితీని అధికారులు, ప్రజాప్రతినిధులు కొనసాగించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పార్టీ నాయకులతో కలిసి బస్సులో ప్రయాణించారు.

ఎమ్మెల్యే కాన్వాయ్‌పై పసుపు చల్లిన టీడీపీ నాయకులు

బొల్లాపల్లి(పల్నాడు): ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కాన్వాయ్‌పై పసుపు చల్లి టీడీపీ కార్యకర్తలు దాడికి ప్రయత్నించిన ఘటన మండలంలోని గంగుపల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మన్నేపల్లి తండా సమీపంలోని మన్నేపల్లి స్వామిని దర్శించుకుని తిరిగి వస్తుండగా గంగుపల్లి సమీపంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు జై బాలయ్య అంటూ నినాదాలు చేశారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే కారుపై పసురంగు చల్లారు. స్థానిక పోలీసులు, ఎమ్మెల్యే భద్రతా సిబ్బంది రంగంలో దిగారు. వారిని పోలీసులు చెదరగొట్టారు. ఈ విషయంపై పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిపారు.

జిల్లా జడ్జి మనోహర్ రెడ్డి మృతి



గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించి ఏపీపీగా అనంతరం జిల్లా జడ్జిగా ఎదిగిన జి.మనోహర్‌రెడ్డి శనివారం గుండెపోటుతో మృతి చెందారు. రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన ఆయన ఏలూరులోని సీఆర్‌రెడ్డి లా కాలేజీలో విద్యను పూర్తి చేశారు. అనంతరం సీనియర్ న్యాయవాది చెవుపోగు రాధాకృష్ణమూర్తి వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2008లో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎంపికై పొన్నూరు, నరసరావుపేట, చిలకలూరిపేటలో విధులు నిర్వహించారు. 2015లో జిల్లా జడ్జిగా ఎంపికై తొలుత ప్రొద్దుటూరు అనంతరం ఒంగోలులో బాధ్యతలు నిర్వర్తించారు. తదుపరి డెప్యూటేషన్‌పై లా సెక్రటరీగా నియమితులయ్యారు. అనంతరం కాకినాడ జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. అనారోగ్య కారణాలతో గుండెపోటు రావడంతో ఆయన కాకినాడలో మృతి చెందారు.